జిల్లాలో విస్తారంగా వర్షాలు



భువనగిరి, న్యూస్‌టుడే: జిల్లాలో పలుచోట్ల బుధవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడ్డాయి. సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. అడ్డగూడూరులో అత్యధికంగా 111.5 మి.మీ భారీ వర్షం నమోదుకాగా, ఆలేరులో 43, ఆత్మకూర్(ఎం)లో 36.8, వలిగొండలో 31.3, భువనగిరి మండలం నందనంలో 17.5, మోత్కూరులో 15.5, రాజపేట మండలం పాముకుంటలో 10.5, గుండాలలో 9.5, యాదగిరిగుట్టలో 9.3, మోటకొండూరులో 5.5 మి.మీ వర్షపాతం నమోదైంది. భువనగిరి పట్టణంలోనూ జల్లులు పడ్డాయి.

అన్నదాతకు నష్టం.. అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలో ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోతకు వచ్చిన వరిచేలు నేలవారి భారీ నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పత్తి తడిసి ముద్దైంది. ఇదివరకే కురిసిన వర్షాలకు పత్తిచేలు ఎరుపురంగుకు మారి ఎండిపోయాయని.. తాజా వర్షంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



అడ్డగూడూరులో భారీ వర్షానికి నేలవారిన వరిచేను

వృక్షస్థాపన మహోత్సవం



ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తదితరులతో నక్షత్ర మొక్క నాటిస్తున్న యాదాద్రి ప్రధానార్చకులు నరసింహాచార్యులు


యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీలక్ష్మీహయగ్రీవస్వామి ఆలయం చెంత లక్ష్మీనరసింహాచార్యులు నాటించారు. 27 నక్షత్రములు, ఆదిత్యాది నవ గ్రహాల అనుగ్రహం వేదోక్త నక్షత్ర వృక్ష స్థాపన మహోత్సవం బుధవారం ఘనంగా చేపట్టారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు వనజీవి రామయ్య, హనుమంతరావు, వంశీ ఆర్ట్ అధినేత వంశీ రామరాజు, లిమ్స్ అధినేత మార్కండేయులు చేతుల మీదీ ఒకేసారి 27 నక్షత్ర ముల మొక్కలను యాదాద్రి ప్రధానార్చకులు నల్లంథిఘళ్ పొందుటకు ఈ మొక్కలు పూజించడం సనాతన ధర్మంగా వస్తుందని, ఇవి అరుదైన మొక్కలని అర్చకులు పేర్కొన్నారు. అనంతరం సన్మాన కార్యక్రమం గమన్ ఆసుపత్రి, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

గండంలో.. యువ మూత్రపిండం

కట్టంగూరు మండలానికి చెందిన మమత (21) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి అడ్డా కూలీ. తల్లి ఓ ప్రైవేటు వసతిగృహంలో పనిచేస్తుంది. ఏడాది క్రితం ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రికి వెళ్తే రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు వెల్లడించారు. కొవిడ్‌లో రెండు సార్లు కరోనా సోకడంతో వైద్యులను సంప్రదించకుండానే విచ్చలవిడిగా మందుల వాడకంతోనే ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయని ప్రాథమికంగా నిర్ధారించారు. ఆమె ఏడాది నుంచి నల్గొండ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటోంది.

కనగల్ మండలానికి చెందిన శిరీష (24)కు చిన్న వయసులోనే పెళ్లయింది. ఇద్దరు కూతుళ్లు. ప్రసవ సమయంలో ఎక్కువ డోస్ కలిగిన మందుల వాడకంతో ఆమె రెండు కిడ్నీలు చెడిపోయాయి. సరైన సమయంలో స్పందించి ఉంటే ఆమెకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికం అనుభవిస్తున్న ఆమె ఇద్దరు కూతుళ్ల ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్నారు. వీరితో పాటూ నల్గొండకు చెందిన 24 ఏళ్ల ఉమర్ ఫరూఖ్, 18 ఏళ్ల మరో యువకుడిదీ ఇదే పరిస్థితి.

ఈనాడు, నల్గొండ:



ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా కొవిడ్ అనంతరం కిడ్నీ బాధితుల్లో ఎక్కువగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వారు ఉండటం ఆందోళన కలిగించే పరిణామమే. నల్గొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో గత కొంత కాలం నుంచి డయాలసిస్ కేంద్రానికి యువత ఎక్కువగా వస్తుండటం గమనార్హం. గత రెండేళ్లలో సుమారు 35 మంది ఒక్క నల్గొండ జీజీహెచ్‌లోనే చికిత్స తీసుకుంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సూర్యాపేటలోనూ క్రమంగా చిన్న వయసువారికి డయాలసిస్ చికిత్సలు పెరిగాయని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 ఏళ్లలోపు వారు పది మందికి పైగా చికిత్సకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ డయాలసిస్ కేంద్రాల్లో చికిత్స తీసుకుంటున్న వారిని కలుపుకొంటే ఈ సంఖ్య మరింతగా ఉంది. విచ్చలవిడిగా డ్రగ్స్ వాడకంతో పాటూ కిడ్నీ సమస్యలను సరైన సమయంలో గుర్తించక పోవడంతోనే ఈ పరిణామాలు సంభవిస్తున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. విచ్చలవిడి మందుల (యాంటీ బయాటిక్స్)తోనే ఎక్కువగా కిడ్నీ రోగాలు వస్తున్నాయని చెబుతున్నా.. అవగాహన లోపంతోనూ చిన్న వయసువారిలో కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయని నల్గొండ ఏరియా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మాతృనాయక్ 'ఈనాడు'కు వెల్లడించారు.

ఒక్క వైద్యుడుంటే ఒట్టు..!

ఉమ్మడి జిల్లాలో నల్గొండతో పాటూ మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, హుజూర్‌నగర్, కోదాడ, చౌటుప్పల్, దేవరకొండ, నాగార్జునసాగర్, ఆలేరుల్లో 55 పడకల డయాలసిస్ కేంద్రాలున్నాయి. నిత్యం 472 మందికి రక్తశుద్ధి నిర్వహిస్తున్నారు. ఏ కేంద్రాల్లోనూ మూత్రపిండాల వైద్యులు (నెఫ్రాలజీ) లేరు. దీంతో టెక్నీషియన్స్‌తోనే ఈ కేంద్రాలను నడిపిస్తున్నారు. మరోవైపు అన్ని డయాలసిస్ కేంద్రాలకు బాధితులు ఏటేటా పెరుగుతున్నారు. అందుకు తగ్గ సౌకర్యాలు ఈ కేంద్రాల్లో లేకపోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

❐ గతేడాది 5,855 మంది ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ చికిత్స తీసుకుంటే, ఈ ఏడాది తొలి 7 నెలల్లోనే 3,890 మంది చికిత్స పొందడం గమనార్హం. ఈ సంఖ్య ఏడాది ఆఖరుకు 6 వేలకు చేరుతుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.



నల్గొండ డయాలసిస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్న బాధితులు

దశాబ్దాలుగా నిరుపయోగం

దర్పణం

భువనగిరి పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన భారీ షెడ్లు దశాబ్దాలుగా నిరుపయోగంగా మిగిలాయి. కాలనీ వాసుల అవసరాల నిమిత్తం మార్కెట్ ఏర్పాటుకు అప్పట్లో మూడు భారీ షెడ్లు నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి నేటి వరకు అవి నిరుపయోగంగా మిగలడంతో ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. ప్రస్తుతం షెడ్లు భారీ వృక్షాల మధ్య శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పలువురు తమ వాహనాలు నిలిపేందుకు, మరి కొందరు భవన నిర్మాణ సామగ్రిని నిల్వ చేసేందుకు వినియోగించుకుంటుండటం గమనార్హం. గత కొన్నేళ్లుగా హౌసింగ్ బోర్డు కాలనీ చుట్టూ ఆవాస ప్రాంతాల సంఖ్య భారీగా పెరిగింది. ఈ షెడ్లతో పాటు పరిసర ప్రాంతంలోని మున్సిపల్ స్థలంలో మార్కెట్‌ను నెలకొల్పిన పక్షంలో ప్రజలకు సదుపాయం కలిగే అవకాశం ఉంది. ఈ విషయమై పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లును వివరణ కోరగా షెడ్లను వినియోగించుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. – భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే



హౌసింగ్ బోర్డు కాలనీలో నిరుపయోగంగా షెడ్లు

గాంధీజీ ఆశయాలను సాధించాలి



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: అహింసనే ఆయుధంగా చేసుకుని శాంతి మార్గాన్ని పోరాటమార్గంగా ఎంచుకుని అఖండ భారతావనికి స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టిన మహనీయుడు గాంధీజీ అని, తను కలలు కన్న భారతావని ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఏసీపీ రమేశ్ కుమార్, సీఐలు రమేశ్, కొండల్‌రావు, కృష్ణ, ఎస్సైలు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నేరప్రవృత్తి వీడి సన్మార్గంలో నడవాలి

భువనగిరి గంజ్: గాంధీ చూపిన శాంతి, అహింస, మానవత్వం, పరోపకారం సద్గుణాలను అలవర్చుకొని నేరప్రవృత్తిని విడి సన్మార్గంలో నడవాలని భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు భువనగిరి సబ్‌జైల్ గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నెహ్రూ, న్యాయసేవాధికార సంస్థ న్యాయవాది శంకర్ పాల్గొన్నారు.



మహాత్ముడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్జి నాగేశ్వరరావు

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ముస్తాబైన శివాలయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హరి, హర క్షేత్రమైన యాదాద్రిలో సంప్రదాయ క్రతువులతో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం మొదలవుతాయి. విజయదశమి ముందస్తుగా శ్రీ దేవీమాతను కొలుస్తూ, తొమ్మిది రోజుల పాటు వివిధ ఆరాధనలు నిర్వహిస్తారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శివాలయాన్ని ముస్తాబు చేశారు. తొలి రోజు అఖండ దీపారాధన, మండప ఆరాధన, కలశ స్థాపన, శ్రీదేవీ మూలమంత్ర జపం, లలితా పారాయణం, సహస్రనామార్చన పర్వాలను నిర్వహిస్తారు.

బహుజన బతుకమ్మ ఉత్సవాలను జయప్రదం చేయాలి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బహుజన బతుకమ్మ ఉత్సవాలను జయప్రదం చేయాలని సమాఖ్య ఛైర్మన్ విమలక్క అన్నారు. బహుజన బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు జనగాం వెళ్తున్న ఆమె భువనగిరిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం ప్రజాసంఘాలు ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రికలు ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, పర్యావరణాన్ని పరిరక్షణ, బతుకమ్మ విశిష్టతను తెలియజేస్తూ ఈ నెల 10వ తేదీ వరకు బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, వెంకట నర్సింగ్‌నాయక్, నాయకులు రాజేష్‌నాయక్, రాజునాయక్, సురుపంగ శివలింగ, ఇటుకల దేవేందర్, కుతాడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న విమలక్క

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

భువనగిరి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా బాపూజీ జయంతి పురస్కరించుకొని భువనగిరి పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులను కెనరా బ్యాంకు, లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ముఖ్యమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, హెల్త్ అసిస్టెంట్ రజిత, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, కెనరా బ్యాంకు మేనేజర్ నితిన్‌రాజు పాల్గొన్నారు.

సహాయం అందిస్తేనే.. సర్వే ముందుకు



డిజిటల్ పంట సర్వే చేయలేమంటూ ఇటీవల నల్గొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

నాంపల్లి, న్యూస్‌టుడే:

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న డిజిటల్ పంట సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులకు (ఏఈవో) ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శిక్షణ ఇచ్చి యాప్‌లను ఏఈవోలకు అందించింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మంగళవారం సర్వే ప్రారంభించాల్సి ఉండగా.. పని ఒత్తిడి, సిబ్బంది కొరత వంటి కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఈవోలు చేతులెత్తేస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం అసాధ్యం అంటున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని చెబుతున్నారు.

ఎందుకీ పంట సర్వే..?

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆహార భద్రత, పంటల బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితరాలకు డిజిటల్ పంట సర్వే ముఖ్య భూమిక పోషించనుంది. ఇందులో భాగంగా వ్యవసాయరంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. దీని అమలుకు రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి, వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు సంకల్పించింది.

ఇతర రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి..

ఆంధ్రప్రదేశ్‌లో 1,000-1,500 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామ స్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించటం, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల వంటి విధులు నిర్వర్తించడంతో ఏఈవోల సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి.

❐ మహారాష్ట్ర, ఒడిశాలలో టెండరు ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించి సర్వే చేయిస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్యనభ్యసించిన వారిని రోజువారీ వేతనంతో పని చేయించుకుంటున్నారు.

❐ కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయడానికి సిద్ధమని ఏఈవోల సంఘం రాష్ట్ర, జిల్లాల నాయకులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు భూమి, ఏఈవోల వివరాలు

సాగు భూమి (ఎకరాలు లక్షల్లో)	జిల్లా	ఏఈవోలు
12	నల్గొండ	140
6.90	సూర్యాపేట	92
4.70	యాదాద్రి	82

సిబ్బంది కొరతే ప్రధాన సమస్య..

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 314 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. వీరి పరిధిలో సుమారు 23.6 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకరు చొప్పున 472 మంది ఏఈవోలు అవసరం. ఉమ్మడి జిల్లాలోని 60 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5 వేల ఎకరాలకు మించి ఉంది. నాంపల్లి మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలోని ఒక్కో ఏఈవో పరిధిలో 9 వేల ఎకరాలకు మించి సాగు భూమి ఉండటం గమనార్హం. డిజిటల్ సర్వేలో భాగంగా సదరు ఏఈవోలు తమ పరిధిలోని అన్ని పంటపొలాల్లోని సర్వే నంబర్లలోకి వెళ్లి వివరాలను ఆన్‌లైన్లో పొందుపరచాల్సి ఉంటుంది.

యాదాద్రి క్షేత్రంలో భక్తుల దైవారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో స్వయంభువులను కొలుస్తూ, చేపట్టిన నిత్యారాధనలు ఆలయ సంప్రదాయంగా కొనసాగాయి. బుధవారం వేకువజామున సుప్రభాతం నిర్వహించిన పూజారులు రాత్రి శయనోత్సవం జరిపారు. బిందెతీర్థం, బాలభోగం, హారతి నివేదనతో జరిపిన కైంకర్యాలు ఆలయ విశిష్టతను పెంచేలా కొనసాగాయి. మూలవరులను పంచామృతంతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కవచమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య చేపట్టారు. భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. రాత్రి వేళ ఆరాధన నిర్వహించిన ప్రత్యేక అర్చన జరిపారు. దర్బార్ సేవోత్సవం నిర్వహించి నిత్యాదాయం వెల్లడించారు. వివిధ విభాగాల నుంచి రూ.10,78,464 ఆదాయం చేకూరింది.



శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

తుప్రాన్‌పేటలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం..!



తుప్రాన్‌పేటలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులు

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

భూసమస్య కారణంగా ఇన్నాళ్లు చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేటలో నిలిచిన హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. నాలుగైదు రోజుల నుంచి ఈ గ్రామంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం వరకు రూ.541 కోట్లతో ఆరు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. మొత్తం 25 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం జరగగా.. యాదాద్రి జిల్లాలోని తుప్రాన్‌పేట, దండుమల్కాపురం గ్రామాల పరిధిలో కలిపి 5 కిలోమీటర్లు ఉంటుంది. తుప్రాన్‌పేటలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూమికి తమకు పరిహారం చెల్లించాలని స్థానికులు అభ్యంతరం తెలపడంతో సుమారు కిలోమీటరు వరకు రహదారి విస్తరణ పనులను చేపట్టలేదు. హైవేపై రయ్..రయ్‌మని దూసుకొచ్చే ప్రయాణికులు ఇక్కడికి రాగానే గతుకుల రోడ్డుపై ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఈ సమస్యను సంబంధిత అధికారులు కొలిక్కి తెచ్చి పనులు చేపట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు తీరనున్నాయి.

పెండింగ్‌లో అండర్ పాస్ వంతెన..

తుప్రాన్‌పేట స్టేజీ, దండుమైలారం క్రాస్ రోడ్డు వద్ద అండర్ పాస్ వంతెనలను నిర్మించకుండా నేరుగా రహదారి పనులు చేపట్టారు. ఈ రెండు చోట్ల ప్రయాణికులు, స్థానికులు జాతీయ రహదారి దాటుతూ చాలా మంది ప్రాణాలను కోల్పోయారు. మరెందరో క్షతగాత్రులుగా మారారు. రహదారి పనులను ప్రారంభించాక ఆ గ్రామస్థులు, ప్రయాణికులు ఆర్‌అండ్(ఎన్‌హెచ్) అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌హెచ్ అధికారులు.. ఈ సమస్య పరిష్కారానికి తుప్రాన్‌పేట స్టేజీ- దండుమైలారం క్రాస్ రోడ్డు మధ్యలో అండర్ పాస్ వంతెనను, ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించాలని దిల్లీకి ప్రతిపాదనలు పంపారు. అండర్ పాస్ వంతెనకు సంబంధించి ఇంకా అనుమతులు రాలేదని ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈ ధర్మారెడ్డి 'న్యూస్‌టుడే'తో తెలిపారు. అనుమతులు వచ్చాక వంతెన పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో బతుకమ్మ వేడుక



సూర్యాపేట సద్దుల చెరువు వద్ద..



భూదాన్‌పోచంపల్లిలో..



చౌటుప్పల్‌లో.. పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, మహిళలు

ఊరూవాడా.. ఉయ్యాలపాట..!



నల్గొండ: ఆర్టీసీ కాలనీలో..



నూతనకల్‌లో...



ఆత్మకూరు(ఎం)లో వీర్ల చెరువు వద్ద ..

పతకాల పట్టు..!

చిలుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. క్రీడలపై ఆసక్తితో ఎన్నో పతకాలు సాధిస్తున్నాడు మండల కేంద్రానికి చెందిన యశ్వంత్. కుమారుడి ఆసక్తిని గమనించిన తండ్రి ప్రోత్సహించాడు. 2013లో సికింద్రాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశం వచ్చింది. దాంతో చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకొన్నాడు.



జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యశ్వంత్‌గౌడ్

★ హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2015లో నిర్వహించిన పోటీల్లో 50 కిలోల విభాగంలో 3వ స్థానంలో నిలిచి మొదటిసారి పతకం సాధించాడు. తర్వాత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. 2018లో ఖేల్ ఇండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. 2021లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మూడు బంగారు పతకాలు సాధించాడు. గత నెల యాదాద్రి జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పదో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 96 కిలోల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. అక్టోబరులో హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ నుంచి అర్హత సాధించాడు.

★ ప్రభుత్వం ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో మరిన్ని పతకాలు సాధిస్తానని యశ్వంత్‌గౌడ్ తెలిపాడు.

రాగిజావ.. చిన్నారికి చేవ

◆ అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల్లో రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇటీవల వెల్లడించారు. కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా. దానికి తోడుగా రాగిజావ ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల పెరుగుతుందని భావిస్తున్నారు. నల్గొండ జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో 2,096 కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 85,788 మంది, గర్భిణులు 10,245 మంది, బాలింతలు 7,009 మంది నమోదై ఉన్నారు.



పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన పోషకాలు ఇందులో ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

ఒక పూట సంపూర్ణ భోజనంలో పిల్లలకు ఉండాల్సిన పదార్థాలు

బియ్యం	75 గ్రాములు
కందిపప్పు	15 గ్రాములు
నూనె	5 మి.లీ.
గుడ్డు	1

పోషకాలిలా..

★ 100 గ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీగ్రాములు, సోడియం 11 మి.గ్రా, కాల్షియం 344 మి.గ్రా, పొటాషియం 408 మి.గ్రా ఉంటాయి.

★ పిల్లల ఎముకలు ధృఢంగా మారడానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

★ కాల్షియం, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇనుము మోతాదు అధికంగా ఉండడంతో రక్తహీనత తగ్గుతుంది.

★ 'సి' విటమిన్‌తో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

★ కండరాల ఆరోగ్యంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.

పిల్లల ఎదుగుదలకు దోహదం..

– డాక్టర్ అజహర్ అహ్మద్, ఎంవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అడవిదేవులపల్లి

రాగి జావ ఎదిగే పిల్లలకు చాలా అవసరం. దీంట్లో ఉండే పోషకాలు వారిని బలంగా మారుస్తాయి. దీనిలో ఉండే అయోడిన్ కారణంగా ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు.

శ్రమించి.. ఖాకీ కొలువు సాధించి!



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ కొలువు సాధించడం అనేక మంది కల. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలకు ఎంతో మంది పోటీ పడుతున్నప్పటికి తాము కలలు కన్న ఉద్యోగం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడి.. చివరికి ప్రభుత్వ కొలువు సాధించి అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు యువత. యూనిఫాం ఉద్యోగంపై మక్కువతో ఇటీవలే ఎస్సై ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువతను 'న్యూస్‌టుడే' పలుకరించింది.

ఐదు ఉద్యోగాలు సాధించాను

– మల్లు సంజీవరెడ్డి, దిర్శించర్ల, నేరేడుచర్ల మండలం, సూర్యాపేట



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మ, నాన్న ధనమ్మ, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను, అన్నయ్య నర్సిరెడ్డిని చదివించారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నాతో పాటు కుటుంబ సభ్యుల కల. డిగ్రీ హైదరాబాద్ నిజాం కళాశాలలో, ఎంసీఏ, ఎంబీఏ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూ, ట్యూషన్లు చెబుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాను.

◆ 2018లో ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించి విఫలమయ్యాను. దీంతో నిరాశ చెందకుండా మరింత కష్టపడి 2022-23 కాలంలో సీఆర్పీఎఫ్ ఎస్సైతో పాటు రైల్వేలో ట్రైన్ మేనేజర్, గ్రూప్-డీ ఉద్యోగాలు సాధించాను. ఈ లోగా పోలీస్ శాఖలో నోటిఫికేషన్ రావడంతో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు దరఖాస్తు చేసి రెండు ఉద్యోగాలు సాధించాను. ఎస్సైగా యాదాద్రి జోన్ టాపర్‌గా సైతం నిలిచాను. ఇలా 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి.. ఇటీవలే ఎస్సై ఉద్యోగంలో చేరి.. మిర్యాలగూడ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాను.

అమ్మ కల నెరవేర్చాను

– మారెళ్ల మౌనిక, తొగర్రాయి, కోదాడ మండలం, సూర్యాపేట జిల్లా



నేను డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాను. నాన్న మాల్యాద్రి తాపీ మేస్త్రీ, అమ్మ వెంకటనర్సమ్మ గృహిణి. చదువు పూర్తయిన వెంటనే హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగంలో చేరాను. నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం, అమ్మకు నేను యూనిఫాం ఉద్యోగం చేయడం కల.

◆ మా ఇద్దరి కలలు నెరవేరాలనే లక్ష్యంతో ఓ వైపు ఉద్యోగం చేసుకుంటూనే ఎస్సై పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రోజుకు 10 గంటల పాటు చదువుతూ.. స్వతహాగా శిక్షణ పొందాను. దీంతో రైల్వేలో గ్రూప్-4 ఉద్యోగం వచ్చింది. అమ్మ కలను నెరవేర్చాలనే ధ్యేయంతో మరోసారి ప్రయత్నించి ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మిర్యాలగూడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా పని చేస్తున్నాను.


ఎస్సై కావడమే ధ్యేయంగా

– వర్కాల సురేష్‌రెడ్డి, బోయగూడెం, తిరుమలగిరి సాగర్ మండలం, నల్గొండ జిల్లా



మాది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. అమ్మనాన్న రేవతి, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. చలకుర్తి నవోదయ పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాను. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇంటర్, ఇంజినీరింగ్ అదే కళాశాలలో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఇంజినీరింగ్ చదివే సమయంలో 2020లోనే కానిస్టేబుల్ అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాను కానీ.. కాలికి గాయంతో ఈవెంట్స్ సాధించలేకపోయాను. దీంతో నిరుత్సాహానికి గురి కాకుండా ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధమై.. ఎట్టకేలకు నా జీవిత లక్ష్యమైన ఖాకీ కొలువు సాధించాను. ప్రస్తుతం శిక్షణ ఎస్సైగా సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నాను.

పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌లు



యువ టూరిజమ్ క్లబ్ లోగో

ఆలేరు, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక, వారసత్వ అంశాలపై ఆసక్తి, పట్టు పెంచేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందులో భాగంగా యువ టూరిజం పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేసి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఏర్పాటు ఇలా..

ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ఉన్నచోట వీరిని క్లబ్‌లలో సభ్యులుగా చేర్చుతారు. ఒక్కో క్లబ్‌కు ఒక విద్యార్థి బాధ్యత వహిస్తారు. ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తాడు. ప్రధానోపాధ్యాయుడు, సమన్వయకర్తలు పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ytc.tourism.gov.in వెబ్‌సైట్‌లో తమ బడి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పర్యాటక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములుగా చేస్తారు. విద్యార్థులు తమ ప్రాంత పర్యాటక స్థలాలపై విస్తృత ప్రచారం చేయడానికి ఈ క్లబ్‌లు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు..

జిల్లా	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
నల్గొండ	128	229	51,886
సూర్యాపేట	81	217	40,285
యాదాద్రి	70	171	32,479

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఓపెన్‌స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 6వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. నల్గొండ జిల్లాలో పదో తరగతికి 149 మంది, ఇంటర్‌కు 360 మంది హాజరుకానున్నారు. నల్గొండ డీవీకే రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. సూర్యాపేట జిల్లాలో పదికి 70 మంది, ఇంటర్మీడియట్‌కు 169 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కో- ఆర్డినేటర్ నియామకం.. ఓపెన్‌స్కూల్ ఉమ్మడి నల్గొండ జిల్లా కో- ఆర్డినేటర్‌గా కె.సత్తమ్మ నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కో- ఆర్డినేటర్‌గా పనిచేసిన జగదీశ్ మూడేళ్ల కాలం పూర్తి కావడంతో అతడిని సూర్యాపేట డీఈవో కార్యాలయానికి అటాచ్ చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

కుట్టు శిక్షణ.. ఉపాధికి రక్షణ



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అందమైన వస్త్రాలు తీర్చిదిద్దే నేర్పు, పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే మార్కెట్‌లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌కు మంచి గిరాకీ ఉంది. అలాంటి తత్వాన్ని నేర్పిస్తూ మహిళల స్వయం ఉపాధికి దోహదపడేందుకు ఎస్‌బీఐ గ్రామీణ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌సెట్) గ్రామీణ స్వయం ఉపాధి సంస్థగా పనిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేని మహిళలను గుర్తించి చేతివృత్తిలో భాగంగా కుట్టు శిక్షణ ఇస్తోంది. ఉచిత కుట్టు శిక్షణ వారి స్వయం ఉపాధికి మార్గం వేస్తోంది. మహిళలు, యువతులకు కుట్టు, అల్లికలు, టైలరింగ్‌లో తర్ఫీదు ఇస్తూ వారి భవిష్యత్తుకు భరోసా నింపుతోంది. మూస పద్ధతుల్లో కాకుండా అధునాతన డిజైన్లు నేర్పుతున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందించి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆర్‌సెట్ ఆధ్వర్యంలో నల్గొండలో 35 మందికి నెల రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

కొత్త డిజైన్లకు డిమాండ్..



అంజలి, సజ్జపురం తండా, పాలకవీడు మండలం

నేను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నా. ఖాళీగా ఇంటి వద్ద ఉండకుండా కుట్టు శిక్షణ పొందుతున్నా. భవిష్యత్తులో ఉపాధికి అవకాశం ఉంటుంది. విపణిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త కొత్త డిజైన్లు నేర్పిస్తున్నారు. కుట్టు నేర్చుకున్న తరువాత గ్రామంలోనే టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకుంటా.

సద్వినియోగం చేసుకుంటున్నా..



మౌనిక, అల్వాల, నల్గొండ జిల్లా

మహిళలు, యువతులకు కావాల్సిన విధానంలో టైలరింగ్ నేర్పుతున్నారు. సొంతంగా ఆర్థిక ప్రగతి సాధిస్తానన్న నమ్మకం ఉంది. శిక్షణ పూర్తి చేశాక సొంతంగా దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటా.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సుర్థేపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్(35) కొత్తూరు-సుర్థేపల్లి గ్రామాల మధ్య రహదారి వారగా పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. శరీరంపై స్వల్ప గాయాలతో పక్కనే ద్విచక్ర వాహనం పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తన కుమారుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని లక్ష్మణ్ తల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు.

విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా..

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో లారీ ట్రాన్స్‌పోర్టు అసిస్టెంట్ మేనేజర్ దుర్మరణం పాలైన ఘటన పట్టణంలోని కోదాడ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) కొన్ని సంవత్సరాలుగా పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కోదాడ పట్టణంలోని ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా మంగళవారం కోదాడలో విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మల్లన్ననగర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తమ్ముడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పూలధర పూసింది

★ రెండింతలు పెరిగిన వైనం



సూర్యాపేటలో విక్రయానికి పూలు

భానుపురి, కుడకుడరోడ్డు (సూర్యాపేట), న్యూస్‌టుడే: పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఏటా వీటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సామాన్యులు కొనలేనంతగా ఉంటున్నాయి. పండగల వేళ కాకుండా మామూలు రోజుల్లోనూ తగ్గడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పూల సాగు తక్కువగా ఉంటుంది. ఒకవేళ చేపట్టినా బంతి రకాలపైనే దృష్టిసారిస్తారు. చామంతి, గులాబీ, సీతజడ, తదితర రకాల పూలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయటం లేదు. దీంతో ధరలపై ప్రభావం పడుతోంది.

ధరలు ఇలా..

మార్కెట్లలో వ్యాపారులు చామంతి, గులాబీ, తెల్లచామంతి, బంతి, సీతజడ, తదితర రకాల పూలు విక్రయిస్తుంటారు. చామంతికి గతేడాది కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. గులాబీ పూలు గతేడాది రూ.150 ఉండగా నేడు రూ.400, తెల్లచామంతి గతేడాది రూ.100, ప్రస్తుతం రూ.300, బంతి రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.150 ఉంది. ఇలా ధరలు రెట్టింపవటంతో కొనుగోలుదారులు కాస్త ఆచితూచి కొనాల్సిన దుస్థితి నెలకొంది.

★ ఉమ్మడి జిల్లాలో 220 మంది పూల వ్యాపారులున్నారు. కొన్ని పూలకు రెట్టింపుతోపాటు మరి కొన్ని పూలు రెండింతలు ధరలు పెంచారు. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో సామాన్యులు కొనుగోలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండుమూడు కిలోలు ఖరీదు చేసినవారు నేడు కిలోకే పరిమితమయ్యారు. ఒక్క పూలకే ప్రతి ఒక్కరూ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

ఎక్కడి నుంచి వస్తున్నాయంటే..

స్థానికంగా పూల సాగు తక్కువగా ఉండటంతోపాటు వ్యాపారులు మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఖర్చులు కూడా గతంలో టన్ను రూ.10,000 ఉండగా నేడు రూ.16,000 వరకు పెరిగింది. ఒక్క టన్నుకే రూ.6 వేలు పెరగటంతో లాభాలు అంతంతగానే ఉంటున్నాయని పలువురు వ్యాపారులు వాపోతున్నారు.

గతంలో బాగా లాభాలు

– కందుకూరి సన్ని, పూల వ్యాపారి, సూర్యాపేట



గతంలో ధరలు తక్కువగా ఉండటంతో లాభాలు బాగున్నాయి. ప్రస్తుతం ధరలు పెరిగినా రవాణా, కూలీల ఖర్చులు పోను అంతగా లాభాలు ఉండటం లేదు. ముగ్గురు పని వాళ్లు అవసరం. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేతనం ఇవ్వాల్సి వస్తోంది. అన్ని పోను నెలకు రూ.50 వేల ఆదాయం వస్తుంది. గతేడాది రూ.80 నుంచి 90 వేల వరకు ప్రతి నెలా లాభాలుండేవి.

కాలువల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో?

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో జాతీయ రహదారి- 65పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయనున్నారు. దీనికి ముందుగా రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు పక్కన వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేందుకు కాలువలు నిర్మిస్తున్నారు. వలిగొండ చౌరస్తా నుంచి సాయిబాబా గుడి ముందు నుంచి పద్మావతి వేడుకల మందిరం వరకు కొన్ని నెలల క్రితం గోతులు తవ్వి వదిలేశారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో సిమెంటుతో నిర్మాణం చేశారు. ఇప్పటికీ పైకప్పు వేయలేదు. రోడ్డుపై మట్టి నింపలేదు. దీంతో ఆ ప్రాంత నివాసులు, దుకాణాదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని స్థానిక వ్యాపారి గంజి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు రోడ్డుకు ఇరువైపులా కాలువలు తవ్వారని, నిర్మాణాలు నత్త నడక సాగుతున్నాయన్నారు. భారీ వాహనాలు వస్తే కూలిపోయేలా కాలువలను నిర్మిస్తున్నారని వ్యాపారులు ఫిర్యాదు చేస్తున్నారు. చెరువు అలుగు నుంచి విడుదలయ్యే నీటి ప్రవాహం భారీగా ఉంటుందని, దానికి అనుగుణంగా కాలువను వెడల్పుగా, లోతుగా నిర్మించాలని పురపాలిక ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై పై వంతెన నిర్మాణ కాంట్రాక్టు సంస్థ కేఆర్‌సీ పనుల పర్యవేక్షకుడు ప్రకాశ్ వివరణ కోరగా, స్థానికులకు ఇబ్బందులు జరగకుండా పనులు వేగవంతం చేస్తున్నట్టు చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు సూచించిన డిజైన్ ప్రకారం పనులు చేస్తున్నామని తెలిపారు.


చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్డు పక్కన నిర్మిస్తున్న కాలువ

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు మృతి

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం మలుపు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి మండలం అడ్డగోడూరుకు చెందిన లారీ డ్రైవర్ ఏనుగు నవీన్‌కుమార్(32) మృతి చెందాడు. ఎస్ఐ గంజి స్వప్న కథనం ప్రకారం.. ఏపీలోని రేణిగుంట నుంచి మిషన్ భగీరథ పైపుల లోడుతో వస్తున్న లారీ చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం ఒడ్డు వద్ద ఉన్న మలుపు వద్ద బోల్తా పడింది. దాని డ్రైవరు నవీన్‌కుమార్ అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.


నవీన్‌కుమార్

కుంటలో పడి వృద్ధురాలి..

రామన్నపేట, న్యూస్‌టుడే: ఇంద్రపాలనగరం శివారులోని కుమ్మరికుంటలో బుధవారం నిధానపల్లి గ్రామానికి చెందిన గోపగోని భారతమ్మ (70)అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై పి.మల్లయ్య తెలిపారు. పని నిమిత్తం వచ్చిన ఈవృద్ధురాలు కుంటలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవటానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడటంతో ఈఘటన జరిగినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సర్పంచి కన్నుమూత

రాజపేట, న్యూస్‌టుడే : కాల్వపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి గుంటి కమలమ్మ(80) బుధవారం కన్నుమూశారు. 2002 నుంచి 2007 వరకు సర్పంచిగా పని చేశారు. వివిధ పార్టీల నాయకులు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ కళాకారుడి..

రాజపేట, న్యూస్‌టుడే : మండలంలోని సోమారం గ్రామానికి చెందిన చిందు కళాకారుడు పిల్లుట్ల చంద్రమౌళి(46) బుధవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సెప్టెంబర్ 20న జనగామ జిల్లా దేవరుప్పల ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కాలు విరగడం, ఇతర గాయాల కారణంగా శస్త్రచికిత్స అనంతరం ఇటీవలనే స్వగ్రామానికి తిరిగి వచ్చారు. మంగళవారం అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు తిరిగి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చంద్రమౌళి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో చిందు కళాకారుడిగా గుర్తింపు పొందారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంగీత నాటక అకాడమీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.


చంద్రమౌళి

150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బెజ్జంకి : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం గ్రామానికి చెందిన పలువురు కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. తోటపల్లి శివారులోని ఓ కోళ్లఫారం వద్ద మిని గూడ్స్ వాహనాల నుంచి డీసీఎం వ్యాన్‌లోకి బియ్యం బస్తాలు ఎక్కిస్తుండగా సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్సై క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు జరిపారు. సుమారు 150 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఎనిమిది మిని గూడ్స్ వాహనాలు, డీసీఎం వ్యాన్‌ను రాణాకు తరలించారు. బొమ్మలరామారం గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

రాజపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొండ్రెడ్డిచెరువు గ్రామంలో బుధవారం రాత్రి వీధికుక్కల దాడిలో ఇదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. తన నానమ్మ ఇంటివద్ద నుంచి తన ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కుక్కలు దాడి చేసినట్లుగా గ్రామస్థులు తెలిపారు. గాయపడ్డ పవన్‌ను గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.

గొలుసు దుకాణాలపై దాడులు

రాజపేట, న్యూస్‌టుడే : సోమారం గ్రామంలో గాంధీ జయంతి రోజున గొలుసు దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం రాత్రి మూకుమ్మడి దాడి చేశారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడమే కాకుండా 25 మద్యం బాటిళ్లను స్వాధీనపరచుకున్నట్లుగా ఎస్సై ఉపేందర్‌యాదవ్ తెలిపారు. ఆయా గ్రామాల్లో తరచుగా గొలుసు దుకాణాలపై దాడులు చేపట్టనున్నట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

చీకట్లో బతుకమ్మ ఆట

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అనాజిపురంలో బుధవారం సాయంత్రం 4గంటల నుంచి వర్షం కురవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి బతుకమ్మ పేర్చుకుని సాయంత్రం ఆడిపాడాలని ఎదురు చూసిన మహిళలకు నిరాశే ఎదురయ్యింది. రాత్రి 8గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మాజీ సర్పంచి ఎదునూరి ప్రేమలత భర్త మల్లేశ్ సాయంత్రం 6గంటల నుంచి స్థానిక లైన్‌మెన్ ఏడీఈ, డీఈ మల్లికార్జున్, నుంచి ఎస్ఈ సుధీర్ వరకు సమస్యను తీసుకెళ్లగా ఎట్టకేలతకు 8గంటలకు ఎస్ఈ సమస్య పరిష్కరించారు. ఈ విషయంపై ఎస్ఈని వివరణ కోరగా సమస్య పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపడతామని చెప్పారు.

లక్ష్మయ్యకు రాష్ట్రస్థాయి అవార్డు

మోత్కూరు, న్యూస్‌టుడే: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన ఆర్కే కళాసాంస్కృతిక ఫౌండేషన్ వారు అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాల్లో సేవలందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. మోత్కూరు సంతోష్ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకునిగా పనిచేస్తున్న తోట లక్ష్మయ్యకు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుని అవార్డు లభించింది.

కిక్ కొడితే.. పతకమే



భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టు వదలని విక్రమార్కుడిలా తైక్వాండో క్రీడలో వరస విజయాలు సాధిస్తూ ఇటీవలనే బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నాడు పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి గునుగుంట్ల సోహాన్. చిన్నతనంలోనే జూనియర్ కళాశాల ఆవరణలో శిక్షణ తరగతులు జరుగుతుండగా గమనించిన తల్లిదండ్రులు శ్రీహరి, శ్రీలతకు చెప్పడంతో తన కుమారుడి ఆసక్తిని అర్థం చేసుకొని 2015లో గుర్రం కృష్ణ మాస్టర్ వద్ద చేర్పించారు. మాస్టర్ వద్ద ప్రత్యేక శిక్షణ అందుకొని 2017లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో జరిగిన ఛాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం సాధించాడు. అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొని ఎన్నో పతకాలతో పాటు ఎల్లో, బ్లూ, బ్లూ1.. ఇలా 8రకాల బెల్టులు సాధించారు. గత నెల చౌటుప్పల్‌లో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ అర్హత పోటీలో విజయం సాధించి బ్లాక్‌బెల్ట్‌ను కైవసం చేసుకున్నారు. తైక్వాండో క్రీడలోనే కాకుండా చదువులోనూ చిచ్చరపిడుగైన సోహాన్ గత ఏడాది హయత్‌నగర్‌లో జీ హైస్కూల్‌లో +1,+2 పూర్తి చేసి టాపర్‌గా నిలిచారు. ఈ ఏడాది యూఎస్‌ఏ యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ థామస్ కళాశాలలో బీటెక్(కంప్యూటర్ సైన్స్)లో చేరారు. స్పోర్ట్స్ కోటాలో 70శాతం రాయితీతో సీటు సంపాదించడం గమనార్హం.

ఆసక్తి గమనించి శిక్షణ ఇచ్చాం:

కృష్ణ మాస్టర్

ఇప్పటి వరకు నా శిష్యుల్లో సోహాన్ లాంటి పట్టుదల ఉన్న విద్యార్థిని చూడలేదు. కళాశాల ఆవరణలో శిక్షణ తరగతులను నిర్వహిస్తుండగా తన తండ్రి వెంట వాకింగ్‌కు వచ్చి అదే పనిగా చూసేవాడు. అతని ఆసక్తిని గమనించి దగ్గరకు పిలిచి ఆసక్తి ఉందా అని అడగడంతోనే అదే రోజు తన తండ్రిని తీసుకు వచ్చి క్లాసులో చేరాడు. అతని ఉత్సాహాన్ని గమనించి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల ఎంతో నైపుణ్యం సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇటు చదువు, అటు తైక్వాండోలో విజయపరంపర కొనసాగిస్తున్నాడు. బ్లాక్‌బెల్టుతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు సాధించడం గొప్ప విషయం.


తైక్వాండో మాస్టర్‌తో సోహాన్

క్రీడలతో మానసికోల్లాసం : విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: నేటి ఉరుకులు పరుగుల జీవితంలో క్రీడలను దాదాపుగా మరిచిపోయారని, దానికి తోడు సామాజిక మాధ్యమం కూడా ఒక కారణమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అభిప్రాయపడ్డారు. యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో మండలంలోని వంగపల్లి గ్రామంలో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ హాజరై క్రీడలను వీక్షించారు. పోటీల్లో యాదగిరిగుట్ట లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, మీడియా, ఎస్పీఎఫ్, అర్చకుల జట్లు పాల్గొన్నాయి కార్యక్రమంలో యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్, రూరల్ సీఐ కొండల్‌రావు, ట్రాఫిక్ సీఐ కృష్ణ, ఎస్పీఎఫ్ సీఐ శేషగిరిరావు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

హామీల అమలు కోసం ఉద్యమించాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి కోరారు. దుబ్బాకలో బుధవారం నిర్వహించిన పార్టీ గ్రామ సభలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గ్రామాల్లో ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణకే పరిమితం చేసిందన్నారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గుండాల ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కంబాలపల్లి మత్స్యగిరి ఎన్నికయ్యారు. జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, మామిడి వెంకట్‌రెడ్డి, గొరిగె సోములు, గణేశ్, గుండాల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షపై పోరాటం: కేవీపీఎస్

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: కుల వివక్షను రూపుమాపేందుకు పోరాటం సాగించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండమడుగు నర్సింహ్మా, జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ అన్నారు. కేవీపీఎస్ అవిర్భావ దినోత్సవం సందర్భంగా భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కులవివక్ష, అంటరానితం నిర్మూలన, ఆర్థిక సమానత్వం సాధించేందుకు కేవీపీఎస్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సుర్వంగ శివలింగం, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిషోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండమడుగు నర్సింహ్మా


యాదగిరిగుట్ట-శ్రీరాంనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు


చౌటుప్పల్‌లో..


రాజపేటలోని రామకృష్ణ సాయి మందిరం ఆవరణలో..

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంగిలి పూల బతుకమ్మతో బతుకమ్మ సందడి బుధవారం మొదలైంది. జిల్లాలోని అన్ని మండలాల్లో భక్తిశ్రద్ధలతో వేడుక నిర్వహించారు. ఉదయం నుంచి సేకరించిన పూలతో బతుకమ్మలను పేర్చి ఒక్క దగ్గర చేర్చి మహిళలు, యువతులు బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము ఆయె చందమామ అంటూ పాటలు పాడుతూ ఆడారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పట్టణ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.


గుండాలలో..


ఆలేరు: కొలనుపాక సోమేశ్వరాలయం వద్ద...


తుర్కపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సంస్థాన్ నారాయణపురంలో..


బీబీనగర్‌లో..


కన్యకాపరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


తాతానగర్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు


ఇందిరానగర్‌లో..

గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీలకు ఘన నివాళులు


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి, పుర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ గంగాధర్

మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను భాజపా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలేరు బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కొన్ని సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వారికి పాలు, పండ్లు పంపిణీ చేశారు. తుర్కపల్లి ప్రభుత్వ కార్యాలయాలు, యువజన సంఘాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు జయంతి జరిపారు. గుండాల గ్రంథాలయం ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూర్(ఎం)లో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాములునాయక్, మోటకొండూరులో తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజపేట గాంధీ కూడలిలో అఖిలపక్ష నాయకులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. చౌటుప్పల్‌లోని గాంధీ పార్కులో ప్రతిష్ఠించిన మహాత్మాగాంధీ విగ్రహానికి పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్, పాలకవర్గం పూలమాల వేసి నివాళి అర్పించారు. చౌటుప్పల్‌లోని పురపాలిక సంఘం, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో, కాంగ్రెస్, తెలుగు దేశం, జనసేన పార్టీల కార్యాలయాల్లో, సంస్థాన్ నారాయణపురంలో ఎంపీడీవో కార్యాలయంలో జయంతి నిర్వహించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎండీ నయాంషరీఫ్ కుటుంబానికి మాతృశ్రీబైక్ పాయింట్ నిర్వాహకుడు దంటిక అశోక్ సమకూర్చిన నిత్యావసర సరకులను బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అడ్డగూడూరు ఎంపీడీవో కార్యాలయంలో వేడుక జరిపారు. బుజిలాపురం, మోత్కూరులో గాంధీ విగ్రహానికి పుర అధ్యక్షురాలు నివాళులర్పించారు. భువనగిరి పట్టణంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గాంధీపార్క్‌లో మహాత్ముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. భువనగిరి మండలం హన్మాపురంలో కాంగ్రెస్ నాయకులు, బస్వాపురంలో గాంధీ విగ్రహానికి మాజీ ఎంపీపీ నరాల నిర్మల, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేశారు. వలిగొండలో కాంగ్రెస్ నాయకులు, గాంధీనగర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి నిర్వహించారు. బీబీనగర్ పంచాయతీ వద్ద గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. బొమ్మలరామారం ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఆయా గ్రామాల్లో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ప్రభుత్వ కార్యాలయాల్లో, భూదాన్‌పోచంపల్లిలో గాంధీజీ విగ్రహానికి పురపాలక ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి పూలమాలలతో నివాళులర్పించారు.

– న్యూస్‌టుడే, బృందం


భాజపా కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బూర నర్సయ్యగౌడ్, నాయకులు


చౌటుప్పల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న పురపాలిక ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్, పాలకవర్గం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80082 78928
80085 74375

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం ఎస్సీకాలనీలోని మురుగు కాల్వపైన ఉన్న స్లాబ్ పగిలిపోయి ఇనుప చువ్వలు బయట పడి ప్రమాదకరంగా ఉన్నాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.
–నాగారం మహేష్, బొమ్మలరామారం.

✔ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.
–పద్మజ, పంచాయతీ కార్యదర్శి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే:

? మున్సిపాలిటీలో టెండర్లు వేసే సందర్భంలో కాంట్రాక్ట్ టెండర్ కింద చెల్లించిన 1 శాతం నగదు, టెండర్ రాని సమయంలో తిరిగి ఇవ్వాల్సి ఉన్నా తిరిగి ఇచ్చేందుకు జాప్యం చేస్తున్నారు. –మధు, భువనగిరి

✔ వీటికి సంబంధించి 2021 నుంచి 300 ఫైల్స్ పెండింగ్‌లో ఉండగా 100 పరిష్కరించాం. దీనికి సమయం పడుతుంది. –రామాంజులరెడ్డి, కమిషనర్, భువనగిరి మున్సిపాలిటీ

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డా.రాజగోపాల్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డా. రాజగోపాల్‌ను నియమిస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డా.కె.అలివేలుపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయనే కారణంతో ఆమెను బాధ్యతల నుంచి తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసినట్టు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పురపాలికలోని అన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం జరుగుతుందని పుర అధ్యక్షురాలు గుర్రం కవిత అన్నారు. బుధవారం పురపాలిక పరిధిలోని కొండాపురంలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పుర ఉపాధ్యక్షుడు బి.వెంకటయ్య, ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్, కౌన్సిలర్లు విజయ, పి.వెంకన్న, మల్లయ్య, పెద్దరమేష్, ఎండీ.మజీద్, వేణు, రాజు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

గుండాల, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ.దేవిక అన్నారు. బుధవారం పనులపై నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనితో పాటు కుటుంబంలో విద్యార్హతలు కలిగి ఉన్న యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆమె వివరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి విజయ, ఉపాధిహామీ క్షేత్రసహాయకులు కె.నవనీత, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


గుండాల గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎ.దేవిక

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం)లో గ్రామసభ నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ కోరారు.

మోటకొండూరు : మండలంలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు జాతీయ ఉపాధి హామీకి సంబంధించి గ్రామసభలు బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులపై ప్రణాళిక తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఇందిర సూచించారు.

యువకుల శ్రమదానం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పట్టణంలోని బీసీ విద్యార్థి వసతి గృహంలో శ్రమదానం చేశారు. వసతి గృహం పరిసరాల్లోని చెత్తను, పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనంజేయులు మాట్లాడుతూ.. యువత సమాజ సేవకు పునరంకితం కావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లియాఫీ ఆవిర్భావ వేడుకలు

భువనగిరి, న్యూస్‌టుడే: జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) ఆవిర్భావ వేడుకలు భువనగిరి ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడు కరకాల సుదర్శన్ లియాఫీ జెండా ఎగరవేశారు. అనంతరం కేకు కోశారు. జోనల్ నాయకుడు అన్నం వీరారెడ్డి మాట్లాడుతూ.. ఏజెంట్ల సమస్యలపై ఆలిండియా జోనల్ నాయకులు ఎప్పుడూ పోరాడుతూనే ఉంటారని తెలిపారు. గాంధీ జయంతి పురస్కరించుకొని మహాత్ముడికి నివాళులర్పించారు. భువనగిరి గాంధీపార్కులో బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు గద్దె నరసింహ, మల్లేశం, సెక్రెటరీ వెంకన్న, రామచందర్, రామునాయక్, బానోతు వెంకటేష్, కైరంకొండ వెంకటేశ్ పాల్గొన్నారు.



భువనగిరి ఎల్ఐసీ కార్యాలయంలో కేకు కోస్తున్న ఏజెంట్లు

క్రీడాకారులకు బెల్టుల ప్రదానం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: తైక్వాండో సాధనతో మానసిక ఉల్లాసం పొందవచ్చని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడ్ టెస్ట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు సింగిల్ పంచ్, డబుల్ పంచ్, సైడ్ షార్ప్ నెక్, డైరెక్షన్ ట్రస్ట్ కిక్, రౌండ్ కిక్, మూవింగ్ కిక్ విన్యాసాలు ప్రదర్శించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆయన బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఓరుగంటి రవికుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు